

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - పదమూడవ కథ -

*(గత సంచికతరువాయి)*

**హాస్పిటల్ ఆవరణలో** అన్నివేపులా గార్డెన్ పెంచడంతో హాస్పిటల్ ఒక పార్క్ లో ఉన్నట్టుండేది. ఎత్తైన చెట్లు , మెత్తటి పచ్చిక , గార్డెన్ లో అందమైన పూల చెట్ల మధ్య నడిచివెళ్తుంటే ఎన్నో సున్నితమైన పరిమళాలు చుట్టు ముట్టేవి. ఇంత అందమైన వాతావరణం , చక్కని హాస్పిటల్. తనకిష్టమైన పని చెయ్యడానికి అన్ని చక్కగా అమిరాయి అనుకుంటే ఇతనిక్కడుండాలా? అనిపించేది ఆమెకు.

కొత్తదారి లో ప్రయాణం ఎప్పుడూ అంత తేలికగా ఉండదు. గతుకులు అలవాటయ్యేవరకూ కష్టమే.

ఆమెతో పనిచేసే వాళ్ల నుండి మొదట్లో తిరస్కారాలెదురయ్యేవి. అప్పటివరకూ తమలో తాము నవ్వుతూ మాట్లాడుకుంటున్న వాళ్ళు ఆమె రాగానే మాటలాపేసి నిశ్శబ్దంగా ఉండేవాళ్ళు. పనిలో ఏదైనా అనుమానం వచ్చి ఇది ఎలా అని అడిగితే మాకు తెలియదని సమాధానం చెప్పేవాళ్ళు. కేసుకు సంబంధించిన విషయాలు తెలియజెయ్యకపోవడం , ఆమె ఏదైనా మర్చిపోతే వెంటనే ఛీఫ్ కు రిపోర్ట్ చెయ్యడం వంటివి చేస్తుండేవారు.

వాళ్ల సహాయనిరాకరణకు పెద్దగా బాధపడేదికాదు . అలాంటి విషయాల్లో ఓర్పుని మించిన అస్త్రం లేదని ఆమెకు తెలుసు. రామచంద్ర ఇదంతా గమనిస్తూ ఉండేవాడు కానీ అందరి ఎదురుగా సహాయం చేసేవాడుకాదు. ఒకే దేశపు ఫీలింగ్ తో ఆమెకు హెల్ప్ చేస్తున్నాడన్న భావన వాళ్ళకు కలిగితే ఆమెకు మరీ కష్టమవుతుందని చూసీ చూడనట్టుండేవాడు. పైకి తనకేం పట్టనట్టు కనిపిస్తూనే చాలా సార్లు , ఆమెకూ, వాళ్ళకూ కూడా తెలియకుండా సమస్యను పరిష్కరించేవాడు.

వాళ్ళ తిరస్కారాలాకన్నా కూడా రామచంద్ర లో కనిపించే నిర్లిప్తత ఆమెను ఎక్కువగా బాధపెట్టేది. అతనింకా పాత విషయాలు మర్చిపోలేదనుకుంది. అలాంటి వాతావరణంలో పనిచెయ్యడం ఎప్పటికైనా కష్టమేననుకుని ఖాళీ సమయాల్లో ఎన్నో ఉద్యోగాలకు అప్లికేషన్స్ పెట్టేది.

ఆమె చేరిన ఆర్నెల్లకు , వాళ్ల స్పెషాలిటీ కు సంబంధించిన కాన్ఫరెన్స్ నిర్వహించాల్సి రావడంతో ఒక నెల ముందునుండీ దానికి సంబంధించిన పనుల్లో, డా. రామచంద్ర, ఛీఫ్ మునిగిపోయారు. అందరికన్నా సీనియర్ అయిన గౌతమికి డిపార్ట్ మెంట్ బాధ్యతలు అప్పగించారు. అప్పటివరకూ ఆమెతో అంటీ ముట్టనట్టు ఉన్న జూనియర్స్ అందరూ ఆమెమీద ఆధార పడక తప్పలేదు. ఆ నెలరోజులూ వాళ్ళకే సమయంలో అవసరమొచ్చినా, ఆమె వెంటనే అందుబాటులో ఉండేది. ఎంత రాత్రివేళైనా విసుక్కోకుండా వచ్చి కాంప్లికేషన్స్ ని పరిష్కరించేది.

వాళ్లు చెయ్యలేని కష్టమైన సర్జరీలు చాలా సులువుగా చేసి చూపించేది. కొత్త కొత్త సర్జరీ టెక్నిక్స్ వాళ్ళకు నేర్పించేది. కష్టమైన కేసుల్లో సహాయం కోసం ఆమెను ఎప్పుడైనా పిలవొచ్చు అన్న నమ్మకం కలిగాక ఆమెతో స్నేహంగా ఉండేవాళ్ళు. కష్ట సమయాల్లో ఆమె చూపించే నిబ్బరం , నేర్పు చూసిన తర్వాత వాళ్లకు తెలియకుండానే ఆమెకు అభిమానులయ్యారు.

ఎవరైతే మొదట్లో ఆమెకు సహాయం చెయ్యలేదో, కొన్ని పరిస్థితుల్లో వాళ్ళకవసరమైనపుడు అండగా నుంచుంది. ఎంత సహాయం చేసినా సరే అదో పెద్ద విషయం కాదన్నట్టే ప్రవర్తించేది. వాళ్ళకు బయట పనులున్నపుడు ఆమె వాళ్ళ డ్యూటీ చెయ్యడానికి, ఏమాత్రం అయిష్టత లేకుండా ఆమె ముందుకు రావడం, ఫిర్యాదుల్లేకుండా సంతోషంగా పనిచెయ్యడం వాళ్ళకు ఆశ్చర్యం కలిగింది. ఆమె ప్రవర్తన వాళ్ళలో మార్పుకు కారణమైంది. చిన్న చిన్న పనులకు వంతులు వేసుకోవడం ఆపేశారు. డిపార్ట్ మెంట్ లో డ్యూటీల విషయం లో చిన్న చిన్న ఘర్షణలు తగ్గిపోయాయి.

కాన్ఫరెన్స్ పనులున్న ఆ నెలరోజులు మొత్తం దాదాపు ఆమె డిపార్ట్ మెంట్ లోనే గడిపింది.

కాన్ఫరెన్స్ మూడు రోజులు సాగింది. కానీ, హాస్పిటల్ పని వల్ల మొదటి రెండు రోజులూ ఆమె వెళ్ళలేకపోయింది. చివరి రోజు ఆదివారం కనుక తప్పకుండా మర్నాడు వెళ్ళాలని అనుకుంది. ఆ రాత్రి, ఆమెతో పనిచేసే జేన్ ఆమె ఫ్లాట్ కు వచ్చింది.

“గౌతమీ, మీటింగ్ కు ఎంతమంది ఇండియన్స్ వచ్చారో తెలుసా? అందరూ చక్కగా శారీస్ లో ఉన్నారు. నాకూ చీర కట్టుకోవాలనుంది.” అని చెప్పి తనకో చీర కావాలంది.

లోపలికి తీసుకెళ్ళి తన చీరలు చూపించి ఏదికావాలో సెలెక్ట్ చేసుకోమంది. అన్ని చీరలూ తిరగేసి పింక్ చీర తీసుకుంది.

"ఇదిక్కడే ఉంచు. రేపు ఉదయాన్నే వస్తాను. నువ్వే కట్టాలికదా" అని హడావుడిగా వెళ్ళబోతూ ఆగి

"అవునూ, నువ్వేం కట్టుకోబోతున్నావో చెప్పు. నీ శారీ కన్నా నాదే బెటర్ గా ఉండాలి" అంది

గౌతమి నవ్వింది. “నువ్వే బెటర్ గా కనిపించు . నేను హాస్పిటల్ డ్రెస్ లోనే వస్తాను. “

"అదేం కుదరదు. నువ్వూ నాతో పాటు శారీ కట్టుకోవాలి. నీశారీ నేను సెలెక్ట్ చేస్తాను రా.."

అంటూ మళ్ళీ లోపలికి వచ్చింది. అన్నింటినీ అటూ ఇటూ చూసి తెల్లని పట్టు చీర తీసింది.

మరుసటి రోజు త్వరగా రౌండ్స్ పూర్తి చేసుకుని, కాన్ఫరెన్స్ వెళ్ళింది. చాలామంది ఇండియన్స్ వచ్చారు. అక్కడక్కడ కాన్ఫరెన్స్ హాల్లో చీరలు కనిపిస్తున్నాయి. తెల్లని పట్టుచీర, చిన్న ఎర్రటి బొట్టు , భుజాలవరకూ ఉన్న జుట్టు , లేత గులాబి రంగు లిప్ స్టిక్.

ఆమె నడిచి వెళ్తుంటే కొంత మంది ఆగి మరీ చూశారు. ఛీఫ్ ఆమె దగ్గర కొచ్చి,

"గౌతమీ, బ్యూటిఫుల్ " గాడ్ బ్లెస్ యూ." అని "అసలు నువ్వే గాడెస్ లా ఉన్నావు తెలుసా" అన్నాడు.

లెక్చర్స్ మొదలయ్యాయి. అందరూ ఎవరి విజయాలను వాళ్ళు గొప్పగా చెప్పుకుంటున్నారు. చప్పట్లు మోగుతున్నాయి.

ఎక్కువమంది డాక్టర్లకు ప్రపంచంతో సంబంధాల కన్నా తమ పేషంట్లు, కేసులు, వాళ్ళు తమ మీద వేసే కేసులతోనే అనుబంధం ఎక్కువ. ఆ సంకీర్ణ జీవితం లో తమ విజయాలు , తమ ప్రావీణ్యం, తమ ఎదుగుదల వాటికి గుర్తింపు ఇవే ముఖ్యమైన విషయాలు గా ఉంటాయి.

ప్రతి నిత్యం గుర్తింపు కోసం వెతుకులాట.

ప్రతి శ్వాసకూ ప్రశంస కావాలన్న పాకులాట.

రామచంద్ర టాపిక్ ఏమిటా అని చూసింది. మై ఫెయిల్యూర్స్ ఇన్ సర్జరీ – అ జెన్యూన్ ఎనాలసిస్.

నా వైఫల్యాలు– ఒక పరిశీలన ! పేరే విచిత్రంగా ఉంది.

అందరూ వాళ్ళ విజయానుభవాలను చెప్పి , చప్పట్లు కొట్టించుకుంటారు. ఇతనేమిటీ అనుకుని కూర్చుంది.

"మనిషిగా మనకున్న ఒక హక్కు తప్పు చెయ్యడం. ఆ తప్పుని ఒప్పుకుని, సరిదిద్దుకుని, తోటివారికది జరగక్కుండా కాపాడం మనిషిగా బాధ్యత. హక్కుతోబాటే బాధ్యతలు పెనవేసుకుని వుంటాయి. హక్కు అనుభవించాను. బాధ్యత నెరవేర్చడానికే ఈ టాపిక్ ఎంచుకున్నాను. " అంటూ మొదలు పెట్టి

కొన్ని అరుదైన కేసులు విశ్లేషించాడు. తనెక్కడ పొరపాటు పడ్డాడో వివరించి, మళ్ళీ అలాంటి కేస్ తనకెదురైనపుడు అదే పొరపాటు జరగకుండా ఏం చేశాడో చెప్పాడు.

"ప్రతిదీ స్వానుభవం వల్లే తెలుసుకోవాలంటే జీవితం సరిపోదు. త్వరగా ఎదగాలంటే తోటివారి అనుభవాలు మనకు పాఠాలవ్వాలి."

ఒక అంతర్జాతీయ వేదికమీద ఎంతో మంది విద్యార్థులకోసం తన తప్పులు చెప్పుకోగలగడం, వాటిని అతను విశ్లేషించిన తీరు, 'ఎంతో బాగుంది' అనుకుంది గౌతమి.

ఆమెకతను కొత్తగా కనిపించాడు . అప్పటివరకూ , అతని పట్ల ఉన్న అసౌకర్యమైన భావాలన్నింటినీ ఆ ఉపన్యాసం తుడిచేసింది. టాక్ ఐపోయినా అందరూ ప్రశ్నలతో అతన్ని ఇంకా మాట్లాడిస్తున్నారు.

స్టేజ్ దిగి వస్తూ గౌతమిని చూశాడు. ఆమె కొత్త వ్యక్తిలా కనిపిస్తూ ఉందని చూస్తూ నిల్చున్నాడు. అతనిలో కొత్త వ్యక్తి ని చూస్తూ ఆమె కూడా నిల్చుంది. ఇద్దరి చూపులూ విడిపోకుండా రెండు క్షణాలు కలిసే ఉన్నాయి. ఆమెను గుర్తించినట్టు చిన్నగా నవ్వాడు. ఆ చిన్ననవ్వు తో అతనికి తనమీద కోపం ఏదీ లేదని అర్థమైంది. ఆమెకూడా చిరునవ్వు నవ్వింది.

లంచ్ లో ఇద్దరూ కలిశారు. ప్లేట్స్ తీసుకుని ఒక పక్కగా నుంచున్నారు.

"మీ టాక్ చాలా బాగుంది. ఇట్స్ డిఫరెంట్." ఆమె మాటల్లో ప్రశంసకు

"థాంక్స్" అన్నాడు

అతని లెక్చర్ లో కొన్ని విషయాలు మాట్లాడుకున్న తర్వాత

"మీరివాళ కొత్తగా కనిపిస్తున్నారు. బాగున్నారు"

"జేన్ గొడవ చేసింది ఇలా రెడీ కావాలని. " దూరంగా తమ జూనియర్ గా పనిచేసే జేన్ ని చూపించింది. చీరకట్టుతో సతమతమవుతూ హడావుడిగా తిరుగుతోంది జేన్.

"మీరంతా బాగా స్నేహితులైనట్టున్నారు."

"అవును." జేన్ వంక అప్యాయం గా చూస్తూ చెప్పింది. జేన్ దూరం నుండి వీళ్ళ వంక నవ్వుతూ చెయ్యూపింది.

చాలారోజుల తర్వాత ఆమెను సంతోషంగా చూస్తున్నాడు.

"ఎలా ఉంది డిపార్ట్ మెంట్ పని. మీరు బాగా మేనేజ్ చేస్తున్నారని విన్నాను . బట్ సారీ! "

"ఎందుకు సారీ?" అర్థం కాలేదామెకు

"డిపార్ట్ మెంట్ లో పనంతా మీమీద వదిలేసినందుకు."

"అదేం లేదు. ఐ యాం హాపీ. వాళ్ళంతా చాలా మంచి పిల్లలు."

"నిజంగా? వెరీ గుడ్." వాళ్లు ఆమెతో కలిసి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నాడు.

“కానీ నేను లేకపోతే, పని ఎక్కువ కాలేదూ?”

“అదేం లేదు.  నాకు చాలా బాగుంది”

“ఏదీ, నేను లేకపోవడమా?” నవ్వాడు.

ఆమె  తల వంచుకుని నవ్వి,  మళ్ళీ అతని వంక చూసి,

“మీరిలా కూడా మాట్లాడగలరని నాకు తెలియదు” ఇంగ్లీషులో చెప్పింది.

“మీరన్నది కూడా నిజమే. మీరు లేకపోవడం వల్ల వాళ్ళంతా నాకు క్లోజ్ అయ్యారు.”

ఆ తర్వాత వాళ్ళిద్దరూ లంచ్ టైం లోనూ, కాఫీ బ్రేక్ లోనూ చాలా విషయాలు మాట్లాడుకునేవాళ్ళు. సంభాషణలో వ్యక్తిగతమైన విషయాలు చాలా అరుదుగా వచ్చేవి . ఎప్పటికప్పుడు అతనికి చేసిన అవమానానికి క్షమాపణ అడగాలని అనుకునేది కానీ ఆ విషయం గుర్తులేనట్లే ఉండేది అతని ప్రవర్తన.

ఎప్పుడో ఒక సారి అడిగింది.

“మీ ఫాదర్ మన కాలేజ్ ప్రొఫెసర్ కదా, ఇప్పుడెక్కడున్నారు.”

“ నాన్న కొన్నాళ్ళు పెరాలసిస్ తో బెడ్ మీదే  ఉన్నారు. పోయిన సంవత్సరమే పోయారు.

కొలీగ్స్ మాటల్లో తెలిసిందేమిటంటే , అతనికి తన పాపంటే చాలా ఇష్టమని. అతని భార్య ఎలా ఉంటుందో , ఏం చేస్తుందో అనుకుంది.

అతని మాటల్లో హాస్యానికి ఆమెకు నవ్వొస్తూ ఉండేది. .అతనేది మాట్లాడినా నవ్వకుండా ఉండలేకపోయేది.

ఓ సారి పాప మొదటి పుట్టిన రోజు అని అందరికీ లంచ్ ఏర్పాటు చేశాడు.

ఆ రోజు ఆమె తో నిలబడి మాట్లాడుతుంటే నవ్వాపుకోలేక

" నేనెప్పుడూ ఇలా చీటికి మాటికి నవ్వడం ఎరగను. మీతో కష్టం గా ఉంది.”

అతనితో చెప్పింది.

“పోనీ నేను మాట్లాడడం మానెయ్యనా? “

“ఎలా మానేస్తారు. ఒక చోట పని చేసేటపుడు మాట్లాడకుండా ఎలా?”

“పోనీ, నేను వేరే ఉద్యోగం చూసుకోనా?”.

“డిపార్ట్ మెంట్ లో మీరు లేకపోతే ఎలా? అయినా నెక్స్ట్ మంత్ నేనే వెళ్తున్నాను.” అంది.

మొదట్లో కొన్ని జాబ్స్ కు అప్లై చేసినట్టు, వాటికి సంబంధించిన ఇంటర్వ్యూ కు అటెండ్ అయినట్లు చెప్పి

“నిన్నే ఆఫర్ కంఫర్మ్ అయింది. రెండు మూడు నెలల్లో జాయిన్ అవుతాను.” అని చెప్పింది.

ఎక్కడో , ఏమిటో వివరాలు తెలుసుకున్నాడు.

మూడు నెలల తర్వాత ఆమె చిన్న పిల్లలకు సర్జరీ చేసే స్పెషాలిటీ హాస్పిటల్ లో చేరింది. వెళ్ళబోయే ముందు ఆమె కోసమని చిన్న పార్టీ అరేంజ్ చేశారు. ఆమెతో పనిచేసే వాళ్ళంతా ఆమె వెళ్ళిపోతున్నందుకు చాలా బాధపడ్డారు. జేన్, రాబర్ట్ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

రామచంద్ర  మాత్రం షేక్ హాండ్ ఇచ్చి "ఆల్ ది బెస్ట్. చాలా మంచి హాస్పిటల్. అక్కడ పోస్టింగ్ రావడం అంత తేలిక కాదు . మీరు చాలా అదృష్టవంతులు. " అతను సంతోషంగా చెప్తుంటే ఆమెకెందుకో నిరుత్సాహంగా అనిపించింది. తనువెళ్ళిపోతున్నందుకు అతనికి

కొద్దిగా అయినా బాధ లేదే అని.

ఆమె ముఖం ముడుచుకుపోవడం గమనిస్తూనే ఉన్నాడు.

విజ్ఞానం నిండిన ఆమె కళ్ళల్లో , లౌక్యం ఎరగని అమాయకత్వం ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది. ఆ క్షణం లో ఆమె తనకెంతో దగ్గరైనట్టనిపించింది అతనికి.

'తను తప్ప ఎవరున్నారీ అమ్మాయికి ? ఈమెను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తనదే' అనుకున్నాడు.

ఆమె అమాయకపు బుగ్గని చేత్తో స్నేహంగా తాకాలని అనిపించింది.

కాసేపు అక్కడే ఉంటే ఆ పని చేస్తానేమోనని భయపడ్డాడు.

తనలో కలిగిన ఆ భావాలకు కంగారుపడి, వెంటనే ఏదో పనికల్పించుకుని అక్కడినుండి వెళ్ళిపోయాడు

ఆమె కొత్త హాస్పిటల్ లో చేరిన రెండు మూడు నెలల తర్వాత, ఓ రోజు ఆమె పనిచేసే హాస్పిటల్ రిసెప్షన్ లో డా. రామచంద్రను చూసింది.

ఎదురెళ్ళి " ఎలా ఉన్నారు? ఏమిటిలా వచ్చారు?" అని అడిగింది.

"సత్యను జాయిన్ చెయ్యడానికి వచ్చాను"

"సత్య ఎవరు?"

"మా పాప. తనకు క్లెఫ్ట్ పాలేట్ సర్జరీ కు రేపు అపాయింట్ మెంట్ ఇచ్చారు"

'పాపకు క్లెఫ్ట్ పాలేట్?' ఆశ్చర్య పడింది.

వెంటనే కంప్యూటర్ లో రేపటి లిస్ట్ చూసింది. చాలా పెద్ద లిస్ట్. అందులో సత్య, పదిహేను నెలలు అన్న పేరు మీద వివరాలు చూసింది.

పాప ఏ వార్డ్ లో ఎడ్మిట్ అయిందో చూసింది. ఒక సారి ఎగ్జామినేషన్ రూం లోకి తీసుకురమ్మని చెప్తే పాపను తీసుకుని వచ్చారు స్టాఫ్. ఆమె తన గదిలోనే పాపను పరీక్ష చేసింది.

మరుసటి రోజు పాపను ఆపరేషన్ థియేటర్ కు అతనే తీసుకొచ్చాడు. పాప తల్లి కనిపించ లేదు. బహుశా రూం లోనే ఉండి ఉంటుంది. ఆ రోజు ఆపరేషన్ల లిస్ట్ చాలా పెద్దగా ఉంది.

తర్వాతి రోజు మొదటి కేస్ గా రామచంద్ర వాళ్ళ పాప సర్జరీ అయింది. గౌతమే చేసింది. సర్జరీ అయిన తర్వాత కూడా ఆమే దగ్గరుండి అన్ని విషయాలూ చూసుకుంది. పాపను డిశ్చార్జ్ చేసే రోజు , రామ చంద్ర పనిచేసే హాస్పిటల్ ఛీఫ్ వచ్చారు.

'హాస్పిటల్ లో పని ఎలా ఉందో, ఆమెకు సౌకర్యంగా ఉందో లేదో' వివరాలు అడుగుతూ గౌతమి దగ్గర చాలా సేపు కూర్చున్నాడు.

అంతలో రామ చంద్ర వచ్చాడు. పాపను తీసుకుని ఇంటికి వెళ్తామంటూ. ముగ్గురూ కలిసి పాప ఉన్న గదికి వెళ్ళారు. పాపతో పాటు ఓ యువతి ఉంది. నీలం రంగు చీరకట్టుకుని తెల్లగా, బొద్దుగా ఉంది ఆమె. పొడుగాటి జుట్టు, చేతులకు బంగారు గాజులు. మెడలో నల్లపూసలు. నవ్వుతూ ఆహ్వానించింది వీళ్ళను. ఆమె నవ్వుతుంటే సొట్టలు పడే బుగ్గలు.

సర్జరీ జరిగిన దగ్గర్నుండీ ఆమెను, పాప దగ్గర చూస్తూనే ఉంది గౌతమి. పని హడావుడిలో ఆమెతో ఎక్కువగా మాట్లాడింది లేదు.

" ఇవన్నీ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే రామచంద్ర ఉంటారు కదా , అయినా సరే మీరు వినండి" అంటూ ఇంటి వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పింది.

" డా. గౌతమి అని ఇది వరకు మాతోనే పనిచేశారు" ఆ యువతితో రామ చంద్ర చెప్పాడు.

“మీ గురించి రామూ చెప్తుంటాడు” చెప్పి రామచంద్రవంక చూసి నవ్వింది.

"శ్రావణి" అంటూ ఆమెను గౌతమికి పరిచయం చేసేంతలో, ఆమెకేదో కాల్ రావడం తో బయటకు వెళ్ళాల్సి వచ్చింది.

ఓ పావుగంట తర్వాత రూం కు వచ్చి పాప డిశ్చార్జ్ కు అవసరమైన పేపర్స్ రామ చంద్రకు ఒప్పజెప్పింది. పాపను తీసుకుని రామచంద్ర వెళ్తుంటే ఆమె వచ్చి గౌతమి చేతులందుకుని స్నేహపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పింది.

వాళ్లను పంపించే సమయం లో ఛీఫ్ కూడా ఆమెతోనే ఉన్నాడు. హాస్పిటల్ ముందున్న కార్ పార్క్ వరకూ వెళ్ళి వీడ్కోలు చెప్పింది.

వాళ్ళు వెళ్ళాక ఛీఫ్ “డ్యూటీ అయిపోయిందా గౌతమీ , నిన్ను ఇంటిదగ్గర డ్రాప్ చేస్తా” అన్నాడు.

ఆమె తన బాగ్ తెచ్చుకుని ఆయనతో పాటు నడిచింది.

హాస్పిటల్ ఆవరణలో ఎత్తైన చెట్లు గాలికి ఊగుతున్నాయి. సాయంకాలపు చల్లగాలి హాయిగా వంటికి తగులుతోంది. మనుషులెవరూ లేరు.

కొద్ది దూరం లో ఉన్న కాఫీ షాపు చూపించి “కాఫీ తాగుదామా” అన్నాడు.

ఇద్దరూ వెళ్ళి కూర్చున్నాక ఆమె వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చి ఆయన ఎదురుగా కూర్చుంది.

"గౌతమీ, నిన్న తమ్ముడు ఫోన్ చేశాడు. నువ్వెలా ఉన్నావని. చెప్పాను. చాలా సంతోషపడ్డాడు"

ఆమె వింటోంది.

"నాకు వాడిలాగా పద్ధతిగా మాట్లాడడం తెలియదు గౌతమీ." అని కాసేపాగి “మీ పేరెంట్స్ వాడికి బాగా తెలుసన్నాడు. అందుకని నా మీద ఇంకో బాధ్యత పెట్టాడు. ఒక సారి ఆలోచించు. ఎప్పుడూ పనీ , హాస్పిటలేనా. నీకో జీవితముందని మర్చిపోతే ఎలా. ”

ఆ సంభాషణ ఎటు వెళ్తోందో గమనించింది.

పెళ్ళి.

తనకు పెళ్ళి.

పెళ్ళి, భర్త, పిల్లలు , సంసారం ఇవన్నీ తనకు సరిపోయే విషయాలేనా?

ఇలా హాస్పిటల్ పని చేసుకోవడం బాగానే ఉందికదా. మనసులోనే నిట్టూర్చింది.

" రామచంద్ర లాంటి మనిషి చాలా అరుదుగా కనిపిస్తారు."

అతని గురించి తనకెందుకు చెప్తున్నాడో ఆమెకు అర్థం కాలేదు

“నిన్ను చిన్నబుచ్చాలని అనుకోకపోతే ఒక విషయం చెప్పనా, ఇప్పుడు నువ్వు చేసే ఉద్యోగానికి ఎంతో మంది అప్లై చేశారు. ఈ హాస్పిటల్ డైరెక్టర్ కు రామచంద్ర బాగా తెలుసు. ఇక్కడ అతనంటే అందరికీ ఎంతో గౌరవం. అతను నీ గురించి ఇచ్చిన రిఫరెన్స్ వల్లే నీకీ వుద్యోగం వచ్చింది.

అతనికి నువ్వంటే ఎంత గురి లేకపోతే వాళ్ళపాపకు నీతో సర్జరీ చేయిస్తాడు. నాతో కూడా నీగురించి ఎంతో గొప్పగా చెప్తాడు గౌతమీ."

అయితే ఆమెకేమీ అర్థం కాక ఛీఫ్ వంక చూస్తోంది.

"మీరిద్దరూ ఒకే రకమైన వ్యక్తులు గౌతమి. వృత్తి అంటే ప్రాణమిస్తారు. మీ ఇద్దరూ జంటగా అయితే బాగుంటుంది."

“అతనికి పెళ్ళైపోయింది కదా సర్?” ఆశ్చర్యంగా అడిగింది.

"రామచంద్రకు పెళ్ళైందా? నాకు తెలియకుండానా?" ఆయన ఇంకా ఆశ్చర్యంగా అడిగాడు.

"మరి ఆ పాప? పాప తల్లి? ఇప్పుడే చూశాం కదా! "

"ఓ శ్రావణి గురించా నువ్వు చెప్పేది. పాప తల్లికాదు. మేనత్త. రామచంద్ర చెల్లెలు. ప్రస్తుతం ఆ పాపను అతని చెల్లెలే చూస్తోంది. ఆపాప రామచంద్ర కూతురనుకున్నావా? ఆ పాపకు క్లెఫ్ట్ ఉందని హాస్పిటల్ లో ఎవరో వదిలేసి వెళ్తే రామచంద్ర ఎడాప్ట్ చేసుకుని పెంచుకుంటున్నాడు."

అలాగా..అతనికింకా పెళ్ళికాలేదా?

ఆలోచనలో పడింది.

ఆమె ఆలోచించడం ఆయన వేరేగా అర్థం చేసుకుని, "నీకిష్టం లేకపోతే, పాపను తన దగ్గరే ఉంచుకోవడానికి అతని చెల్లెలు సిద్ధంగానే ఉంది. ." అనబోయాడు.

"లేదు ,లేదు." కంగారుగా ఆయన్ని వారించింది. గౌతమి.

"అతను ఇంతకాలం పెళ్ళెందుకు చేసుకోలేదు." అడిగింది.

"వాళ్ళ నాన్న పెరాలిసిస్ వచ్చి బెడ్ మీద పేషంట్ లా దాదాపు పదేళ్ళున్నాడు రామూతోనే. ఆయన మంచం మీద ఉన్నందుకు మొదట్లో ఎవరూ ముందుకు రాలేదు. ఆ తర్వాత రామూయే ఆ ఆలోచన మానుకున్నాడు."

కాసేపాగి ఆయనే

"ఆలోచించు గౌతమీ. మంచి అబ్బాయి. మీ ఇద్దరూ ఒకటైతే బాగుంటుంది."

కాఫీ అయిపోయింది. ఇద్దరూ కార్లో కూర్చున్న తర్వాత పెద్దగా ఏం మాట్లాడుకోలేదు.

ఆమె అపార్ట్ మెంట్ వచ్చాక, దిగబోతుండగా చెప్పాడు.

"రేపు ఆదివారం రామూని పంపిస్తాను. ఒక సారి ఇద్దరూ మాట్లాడుకోండి గౌతమీ. పర్లేదా? ఆలోచించి నాకు మెసేజ్ పెట్టు . గుడ్ నైట్" చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

ఆమెకేం బదులివ్వాలో తెలియలేదు.

అన్నీ త్వరగా ముంచుకొస్తున్నట్టనిపించింది. చలిగాలి రివ్వు మని చెంపలకు తగిలింది.

ఫ్లాట్ లోపలికి వెళ్ళాక కోట్ తీసి ఎక్కడో తగిలించి, సోఫాలో కూర్చుంది. మనసంతా ఖాళీగా ఉంది. అలా అని ప్రశాంతంగా లేదు. తను స్త్రీగా , ఒకరికి భార్యగా అవన్నీ ఎలా . అవన్నీ తనకేం తెలుసు. చదువు, పరీక్షలు, పని పేషంట్స్, ఇవన్నీ బాగానే మేనేజ్ చెయ్యొచ్చుగానీ, స్త్రీగా, ఒకరికి భార్యగా అవన్నీ సాధ్యమేనా?

తెలియకుండానే అతనికి పెళ్ళికాలేదు అనగానే ఎక్కడో సంతోషం గా ఉంది.

ఆ రోజు ఆదివారం. అతను వచ్చే రోజు. తెల్లవారకముందే మెలకువ వచ్చేసింది. బాల్కనీ లోకి వచ్చి నుంచుంది. సిటీ ఇంకా నిద్రలేవలేదు. పక్షులు మాత్రం గొడవ చేస్తున్నాయి.

రామచంద్ర

పేరు తలపుకు రాగానే ముఖం లో చిరునవ్వు వెలిగింది. ఇద్దరు కలిసి పనిచేసిన రోజులు గుర్తొచ్చాయి. తను చేసిన అవమానం కూడా గుర్తొచ్చింది.

లోపలికి వచ్చేసింది.

ఉదయం ఎనిమిది అవుతుండగా స్నానం చేసి ఆకాశం రంగు షిఫాన్ చీర కట్టుకుంది. ఎప్పుడూ లేనిది అతనికోసం ఎదురుచూస్తుంటే ఎప్పుడూ లేనంత టెన్షన్ అనుభవించింది. కాసేపాగిన తర్వాత చీర మరీ స్పెషల్ గా ఉందనిపించి , మామూలు డ్రెస్ వేసుకుందామనుకునేసరికి డోర్ బెల్ మోగింది.

గుండె చప్పుడు ఆమె లెక్కబెట్టుకోవచ్చన్నంతగా చెవుల్లో వినిపించింది.

తలుపు తీసి, అతన్ని లోపలికి రమ్మంది.

వేరే ఉద్దేశం తో కలవడం ఇద్దరికీ కొత్తగా ఉంది. కాఫీ తాగుతూ ఏవో ప్రొఫెషన్ కబుర్లు మాట్లాడుకుంటున్నారు. ఎంత సేపైనా విషయానికి రావడం ఇబ్బందిగా ఉందని.

“గౌతమీ..ఒక డ్రైవ్ కు వెళ్దామా?” అన్నాడు.

బయటకు వచ్చి అతనితోబాటే నడుస్తుంటే అతను చాలా పొడుగ్గా ఉన్నట్టు , తను అతనికి భుజాలవరకూ వస్తున్నట్టు గమనించింది.

కార్లో కూర్చున్నాక, ఆమె చీరచెంగు లోపలికి సర్దుకోమని చెప్పి జాగ్రత్తగా డోర్ వేశాడు. రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి.

అతను రోడ్ వంక చూస్తూ డ్రైవ్ చేస్తూ , ఇంగ్లీషులో మాట్లాడుతున్నాడు.

“ఇప్పుడున్న జీవితం బాగానే ఉంది, ఇప్పుడు కొత్తగా పెళ్ళి అనేది ఎందుకో అర్థం కావడం లేదు.” అంది ఆమె

“తోడు కోసం. కష్ట సుఖాలు పంచుకునే తోడు కోసం.”

“దానికి ఫ్రెండ్స్ ఉన్నారుగా.”

“ అనుక్షణం మీకు మాత్రమే తోడుగా నిలిచే ఒక ప్రత్యేకమైన ఫ్రెండ్ దొరుకుతాడు. ఊ …ట్రస్ట్ మీ ! ఇవాళ మనిద్దరం ఎలా ఉన్నామో అలానే ఉంటాము. మిమ్మల్నెప్పుడూ మామూలు స్త్రీగా చూడను. మీనుండి ఏదీ ఆశించను. ఇద్దరం కలిసి బతుకుదాం. కలిసి ఎదుగుదాం. అంతే. పెళ్ళివల్ల మీరు భయపడే మార్పులేమీ రావని మాత్రం మాట ఇవ్వగలను. మీరు ఎలా ఉండాలనుకుంటే అలానే ఉండండి. నావైపు నుండి ఏ ఇబ్బందులూ రావనే అనుకుంటున్నాను. మీరేమైనా అడగాలనుకుంటే చెప్పండి ” అతని ఎప్పటిలా హాస్యంగా కాకుండా సీరియస్ గా మాట్లాడాడు. .

ఒక చోట కారాపాడు. అక్కడ దారికి రెండువేపులా పూలచెట్లు.

ఇద్దరూ కార్లోనే కూర్చున్నారు.

ఎంతోసేపు మౌనం తర్వాత ఆమె అంది.

"మరి నా వల్ల ఇబ్బంది వస్తే?" అడిగింది.

"ఐ కెన్ హేండిల్" అన్నాడు.

చిన్నగా నవ్వింది.

"పాప విషయంలో నీకేమైనా అభ్యంతరాలుంటే చెప్పు." అడిగాడు

"లేదు. లేదు. నాకు ఆ విషయంలో నేను చాలా సంతోషంగా ఉన్నాను. కాకపోతే స్వంతంగా పిల్లలు కావాలనుకోవడం లేదు. ప్రెగ్నన్సీల వల్ల ప్రొఫెషన్ కు దూరం కావడం నాకు మొదటినుండీ ఇష్టం లేదు."

ఆమె చూపులో అంగీకారం చూసి, ఆమె చెయ్యి ఇవ్వమన్నట్టు అతను చెయ్యి చాపాడు.

అతని చేతిలో ఉన్న ఆమె చేతిని పెదవులకానించుకుని "నీ ఇష్టం " అన్నాడు.

ఓ నెలరోజుల తర్వాత ఆమె తల్లి దండ్రులు వచ్చారు. అతని చెల్లెలు బావగారు పెళ్ళిపనులు చూసుకున్నారు. ఛీఫ్ , డిపార్ట్ మెంట్ సభ్యుల మధ్య హడావుడిలేకుండా ఆఫీసులో పెళ్ళిచేసుకున్నారు.

❦❦❦

అల్లుకోవడం తీగెకెంత అవసరమో, ఆధారానికంతకన్నా అవసరమైంది. ఒకరి మీద ఒకరికున్న మీదున్న కాంక్ష వల్ల ఇద్దరి కళ్ళూ ఎరుపుతో తడిశాయి .

ఆమె బుగ్గలు చంద్రకాంత లయ్యాయి !

ఎరుపెక్కిన పెదవులు వణికాయి

అదురుతున్న పెదవులపై అతను తన చూపుదు వేలుంచాడు . అంతకన్నా అర్థమైన ఆధారాన్ని వెతికింది. ఊహించని ఆహ్వానం అతనికి బహుమానమైంది.

స్పర్శలో సుఖముందని ,

సుఖం వల్ల స్పృహ తప్పుతుందని మొదటిసారి తెలిసొచ్చింది ఆమెకు.

ఎవరు సృష్టించారీ సంతోషాలను?

ఆ ప్రకృతికి తలవంచి కృతజ్ఞత తెలుపుకోవాలి అనిపించింది.

తనలోని స్త్రీని అన్వేషించి, ఆవిష్కరించిన అతనంటే ఇష్టమనిపించింది . అది మాటల్లో చెప్పలేక నిస్సహాయురాలిలా నిట్టూర్చింది !

వాలిన రెప్పలనుండి ఓ ముత్యపు బిందువు ఆభరణమైంది.

❦❦❦

ఆ తర్వాత రోజు ఆ రోజు ఆమెకు డ్యూటీ లేదు. అతను మాత్రమే హాస్పిటల్ కు తయారవుతున్నాడు. లేత గులాబిరంగు షిఫాన్ చీర కట్టుకుంది. అతను రెడీ అవుతున్నంత సేపూ అతనివెంటే తిరుగుతోంది.

ఆమె అలా తోడుగా నడవడం, ఆ దగ్గరి తనం ఇంకేవో పనులకు పురమాయిస్తుంటే, తొందరగా తెమలాలన్న కొద్దీ ఆలస్యం అవుతోంది.

షెల్ఫ్ లో ఉన్న సాక్స్ తీసుకుని కుర్చీలో కూర్చున్నాడు. ఏదో కేసు విషయం మొబైల్ లో మాట్లాడుతూ ఒక చేత్తో సాక్స్ వేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఆమె అతని ఎదురుగా చిన్న స్టూల్ వేసుకుని అతని కుడి కాలు వళ్ళో పెట్టుకుని సాక్స్ తొడిగింది. ఫోన్ లో సంభాషణ అయిపోగానే

"గౌతమీ, నాకు చాలా సిగ్గుగా ఉంది. ఎంత గొప్ప సర్జన్ వి, నువ్విలాంటి పనులు చెయ్యడం ప్లీజ్,."

అతని రెండు చేతులూ అందుకుని చెంపలకానించుకుంది. ఒక అరచేతిలో ముద్దుపెట్టి,

" అన్నిట్లోనూ సమానం కాదు" అంది

" నిజమా?"

"అవును, నిన్న తెలిసింది" ఇంకో అరచేతిలో కూడా ముద్దుపెట్టింది.

"అయినా సరే , నాకిలా వద్దు , ప్లీజ్"

మౌనంగా కూర్చుంది.

“ఏంటిది కోపమా? చాలా ఆశ్చర్యంగా ఉంది నీకు కోపం రావడం మొదటి సారి చూస్తున్నాను.” కంగారుగా అన్నాడు.

" నాకేదైనా చెయ్యాలనిపిస్తే , నువ్వు కాదంటే కోపం రాదా ? ”

“ఇదంతా చాలా కొత్తగా ఉంది నాకు, అమ్మాయిల అలక ఎలా డీల్ చెయ్యాలో తెలియదు.”

అతని వంక చూసి నవ్వింది.

“నాకు ఎదురు చెప్పకుండా ఉంటే చాలు.”

“నేనంటే ఇంత ఇష్టమా?” అడిగాడు ఆమె కళ్ళలోకి చూస్తూ

అతని మీదఎంత ఇష్టం ఉందో చెప్పాలనుకుంది. అది తెలియజెప్పాలని , కళ్ళెత్తి చూడబోయింది. కళ్ళు కలపగానే ఓడిపోయింది, ఓటమి గర్వంతో మరింత సిగ్గుపడింది.

అతని ఎడమ కాలిని చేతుల్లోకి తీసుకుని, బొటనవేలిని నెమ్మదిగా ముద్దుపెట్టుకుంది.

అతని వళ్ళంతా సుఖమైన అనుభూతితో తుళ్ళిపడింది.

అతను వంగి ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని కళ్ళలోకి చూస్తూ,

“ఒక అమ్మాయి , అదీ నీలాంటి అమ్మాయి ఇంతగా, ఇలా ప్రేమిస్తుందని నాకు తెలియదు.” ఆమెకు మాత్రమే వినిపించేంత నెమ్మదిగా అన్నాడు.

“నువ్వు కలిసేవరకూ నాకూ తెలియదు.”

★★★★★

(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)

Post your comments